న్యాయపోరాటంతో రైతుల విజయం.. బుయ్యారంలో సంబరాలు!

❖ రైతుల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే వినోద్ రాజీనామా చేయాలి: బీజేపీ నేత కొయ్యల ఏమాజీ.



దశ, బెల్లంపల్లి: తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఏళ్ల తరబడి సాగు భూముల కోసం పోరాడిన రైతులు న్యాయపోరాటంలో విజయం సాధించడంతో పొలాల్లో దుక్కి దున్ని, బాజాభజంత్రీలతో ర్యాలీ నిర్వహిస్తూ సంబరాలు చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజీ ఆధ్వర్యంలో రైతులు తమ భూముల్లో దుక్కి దున్నారు.

ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ, పేద రైతులకు న్యాయం జరిగేలా ఆదేశాలిచ్చిన న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు. గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకుంటూ రైతులను వేధిస్తున్నారని, కేసులు నమోదు చేసి సాగుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం గతంలో పట్టాలు మంజూరు చేసిన భూముల్లోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టించుకోవడం లేదని ఏమాజీ విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే చీరాల బీచ్‌లో జల్సాలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ప్రజా సమస్యలను పట్టించుకోని ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల భూముల విషయంలో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకోవడం ఆపాలని, లేనిపక్షంలో బాధిత రైతులతో కలిసి అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతుల హక్కులను కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో పేద రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పులగం తిరుపతి, కేశవ్‌రెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ముదిమడుగుల లావణ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శనిగారపు శ్రావణ్, కల్లేపల్లి నవీన్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు నర్సింగ్, శ్రీనివాస్, రాజకుమార్, ప్రశాంత్, అవినాష్, ముల్కల సత్యనారాయణ, జుమిడీ వెంకటేష్, ముదిమడుగుల శంకర్, పోషం, గోగర్ల లక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. స్వర్ణకుమారి జిల్లాలోని ఆరుట్ల, మాడ్గుల, ఇర్విన్, యాచారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ రిజిస్టర్లు, మందుల నిల్వ, కోల్డ్‌చైన్, ల్యాబ్ సేవలు, సిబ్బంది హాజరు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అలాగే ఎన్‌సీడీ, టీబీ, ఇమ్యునైజేషన్ సేవలపై సమీక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి డా. స్వర్ణకుమారి సూచించారు. ఈ తనిఖీల్లో హెల్త్ సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఎన్నికలు వాయిదా

తదుపరి ఉత్తర్వుల వరకు ఎన్నికల ప్రక్రియ నిలిపివేత



దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వాయిదా వేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేసిన లేఖ నం. H2/741/2026, తేదీ 03102026లోని ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 04102026న నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియను నిలిపివేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడిన అనంతరం కొత్త ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

❖ తాండూర్ వెంకటేశ్వర కాలనీలో విషాదం

❖ రెండేళ్ల బాబును వదిలి అనంతలోకాలకు..

❖ పోలీసులకు మృతురాలి బాబాయి ఫిర్యాదు



దశ ప్రతినిధి, తాండూర్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాండూర్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన ఎం. రవిశంకర్ కుమార్తె ఎం. అలేఖ్య (23) కు, హైదరాబాద్ బదుగుపేటకు చెందిన ఇందిరాల అచ్యుత్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి శ్రీ ఆద్విక్ అనే రెండేళ్ల కుమారుడు ఉన్నాడు.పెళ్లయిన కొంతకాలానికే దంపతుల మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీంతో మనస్పర్ధలు తీవ్రమై గత రెండేళ్లుగా అలేఖ్య భర్తకు దూరంగా తాండూర్ లోని పుట్టింట్లోనే నివాసముంటోంది. అంతేకాకుండా వీరి విడాకుల వ్యవహారం ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది.ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భర్త వేధింపులను తట్టుకోలేక అలేఖ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది.సంఘటనపై మృతురాలి బాబాయి, ప్రభుత్వ ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్ మదుర్ శ్రీనివాస్ తాండూర్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ వేగవంతం చేశారు.

ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు రజనీకాంత్




దశ, హైదరాబాద్: గాంధీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రజనీకాంత్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. గ్లోబల్ గాంధీ ఫౌండేషన్, గాంధీ జయంతి ఉత్సవాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ మదర్ ఆర్గనైజేషన్ వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 157 మందిని ఎంపిక చేసి సన్మానించింది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. రజనీకాంత్ గతంలో పనిచేసిన మూడు ప్రభుత్వ పాఠశాలల్లోనూ 100 శాతం పురోగతి సాధించడంతోపాటు, విద్యార్థుల చేరికలను పెంచడం, ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు తోడ్పడుతున్నారు. ఆయన పనిచేసిన పాఠశాలలు 2022-23, 2025-26 విద్యా సంవత్సరాల్లో 'బెస్ట్ టీఎల్ఎం స్కూల్'గా ఎంపికయ్యాయి. విద్యారంగంలో ఆయన అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డుతో సత్కరించారు.

డాసోస్ బ్రాండ్ అంబాసిడర్‌గా నాగచైతన్య



దశ, హైదరాబాద్: డాసోస్ క్యాబినెట్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు నాగచైతన్య నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఆయన సంస్థతో భాగస్వామ్యం కొనసాగనుంది. నాణ్యత, ఆధునిక డిజైన్లకు ప్రాధాన్యమిచ్చే డాసోస్.. మాడ్యులర్ క్యాబినెట్ల నుంచి పూర్తిస్థాయి లగ్జరీ ఇంటీరియర్స్ రంగంలోకి విస్తరిస్తోంది. ఇంటి ఇంటీరియర్స్, కిచెన్లు, వార్డ్‌రోబ్‌లు, ఫర్నిచర్, టర్న్‌కీ ప్రాజెక్టులను అందించనుంది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లో లగ్జరీ ఎక్స్‌పీరియన్స్ స్టూడియోను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా ఆధునిక సాంకేతికత, నాణ్యమైన తయారీతో ప్రత్యేకమైన ఇంటీరియర్ సేవలు అందించడమే లక్ష్యమని సంస్థ తెలిపింది.

సృజనాత్మక ఆలోచనలతో సమస్యలకు పరిష్కారం



❖ ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా కళాశాలలో 'బిజ్‌పర్క్స్ 2K26' మేనేజ్‌మెంట్ మీట్

దశ, హైదరాబాద్: మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంస్థ డైరెక్టర్, ముఖ్య పరిపాలనాధికారి డాక్టర్ ఈ. విజయ సూచించారు. నారాయణగూడలోని ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'బిజ్‌పర్క్స్ 2K26' మేనేజ్‌మెంట్ మీట్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జంట నగరాల్లోని 20 విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. 'సవాలు చేయి.. పోటీపడు.. విజయం సాధించు' అనే థీమ్‌తో నిర్వహించిన పోటీల్లో ఫైనాన్స్, మార్కెటింగ్, మానవ వనరులు తదితర అంశాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. ప్రధాన ఆకర్షణగా నిలిచిన 'ది యంగ్ మేనేజర్' పోటీలో నాయకత్వం, నిర్ణయ సామర్థ్యాలను పరీక్షించారు. వివిధ పోటీల్లో విజేతలకు అమృత మిశ్రా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. ముత్యం రెడ్డి, ప్రొఫెసర్ జి. సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. అచ్యుత దేవి, డాక్టర్ ఆర్. బిందు, డాక్టర్ పి. జయశ్రీ, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.



విద్యావేత్తలకు ఘన సత్కారం

❖ హైదరాబాద్‌లో వైభవంగా అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్

దశ, ఓయూ: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక అఖిల భారతీయ శిక్షా భూషణ్ సమ్మాన్ సమారోహ్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. భారతీయ విద్యా రంగానికి విశేష సేవలు అందించిన ముగ్గురు ప్రముఖ విద్యావేత్తలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు.కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహ సర్కార్యవాహ్ సి.ఆర్. ముకుంద్ జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ నారాయణ్ లాల్ గుప్తా జీ సభాధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి హాజరై మంగళాశాసనం అందించారు.ప్రొఫెసర్ మామిడాల జగదీష్‌కుమార్ విద్యా, సాహిత్య రంగాల్లో చేసిన విశేష సేవలకు గాను సత్కారం అందించారు. మాజీ యూజీసీ చైర్మన్‌గా, ప్రస్తుతం ఐఐఎం కలకత్తా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా ఆయన సేవలందిస్తున్నారు. జాతీయ విద్యా విధానం-2020 అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, ప్రాంతీయ భాషల్లో ఉన్నత విద్య, ఆన్‌లైన్ విద్యా విస్తరణ తదితర అంశాల్లో ఆయన చేసిన కృషిని నిర్వాహకులు కొనియాడారు.ప్రొఫెసర్ బి. మహదేవన్ను కూడా ఘనంగా సన్మానించారు. ఐఐఎం బెంగళూరులో ప్రొఫెసర్, డీన్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన ఆయన భారతీయ జ్ఞాన వ్యవస్థ, వేదాలు, భగవద్గీత, నిర్వహణ విద్య తదితర అంశాలపై విశేష కృషి చేశారు. 'ఇంట్రడక్షన్ టు ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్', 'ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్' వంటి గ్రంథాలను రచించారు. చిన్మయ విశ్వవిద్యాపీఠం వ్యవస్థాపక ఉపకులపతిగా కూడా సేవలందించారు.డి.రామకృష్ణారావు, మాజీ ప్రిన్సిపాల్, విజ్ఞాన విహార్ విద్యా సంస్థలు, విశాఖపట్నం, విద్యా రంగంలో చేసిన సుదీర్ఘ సేవలకు గాను సత్కారం అందుకున్నారు. 2019 నుంచి 2025 వరకు విద్యాభారతి జాతీయ అధ్యక్షులుగా, ప్రస్తుతం జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. జాతీయ విద్యా విధానం-2020 అమలు, ఉపాధ్యాయ శిక్షణ, నైతిక విద్య, యోగా, పాఠశాల విద్యా సంస్కరణలపై ఆయన విశేష కృషి చేశారు. విద్యా రంగానికి సంబంధించిన పలు పరిశోధనా పత్రాలను కూడా ప్రచురించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

దశ, కామేపల్లి : బాల్య వివాహాల నిర్మూల నకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జెడ్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.జ్యోతిర్మయ్ అన్నారు. శనివారం కామేపల్లి పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో కామేపల్లి రైతు వేదికలో జూనియర్ కళాశాల, రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జ్యోతిర్మయ్ పాల్గొని ప్రసంగిస్తూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు.బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పలితాలను వివరించారు. బాల్య వివాహాలు పిల్లల మౌలిక హక్కులను తీవ్రంగా హరిస్తాయన్నారు. చిన్నతనంలో వివాహం చేయడం వల్ల అనారోగ్యానికి గురి కావడమే కాకుండా పుట్టబోయే బిడ్డ మానసిక పరిపక్వత లోపించే ప్రమాదం ఉందన్నారు. సమాజం మొత్తం బాధ్యత తీసుకొని ఈ సామాజిక దుష్పవర్తనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలపై సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియ జేయాలని ప్రజలను కోరారు. బాల్య వివాహాల నివారణలో పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. పిల్లల రక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. మహిళలకు న్యాయపరమైన సహాయాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు.

ఓడిపోతే ఈవీఎంలపై నిందలా.. గెలిస్తే సంబరాలా?

❖ కాంగ్రెస్, ఇండియా కూటమిపై బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ ఫైర్



దశ, హైదరాబాద్: ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం.. గెలిస్తే మౌనంగా ఉండి సంబరాలు చేసుకోవడం కాంగ్రెస్, ఇండియా కూటమికి అలవాటుగా మారిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాదరణలో ప్రధాని నరేంద్ర మోదీని ఎదుర్కోలేక కాంగ్రెస్ రాజ్యాంగ వ్యవస్థలపై ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నమ్మకం లేకపోతే తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తే జమ్మూకశ్మీర్, జార్ఖండ్ వంటి ప్రాంతాల్లో ప్రతిపక్షాలు ఎలా విజయం సాధించాయని ప్రశ్నించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు 303 నుంచి 240కి తగ్గగా, కాంగ్రెస్ సీట్లు 52 నుంచి 99కి పెరిగాయని గుర్తుచేశారు. ఈ లెక్కల ప్రకారం కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని అభినందించాలంటూ ఎద్దేవా చేశారు. దేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తదేమీ కాదని, ఓటర్ల జాబితా సవరణలో అభ్యంతరాలుంటే ఫారం6, ఫారం8 ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ముందుగానే సాకులు వెతుక్కుంటోందని విమర్శించారు. భారత ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీయకుండా రాజకీయ పార్టీలు వ్యవహరించాలని బూర నర్సయ్య గౌడ్ సూచించారు.

రోడ్డుపై తాగునీరు వృథా.. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



దశ, పెద్ద అంబర్‌పేట: పెద్ద అంబర్‌పేటలోని సందులో సాయినగర్-బ్యాంకు కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై గత నాలుగు రోజులుగా తాగునీరు రోడ్లపై ప్రవహిస్తూ వృథాగా పోతోంది. తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా పెద్ద మొత్తంలో నీరు రోడ్డుపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీరు రోడ్డుపై నిరంతరం ప్రవహిస్తుండటంతో రహదారి బురదమయంగా మారడంతో పాటు వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. వేసవితో పాటు నీటి సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో విలువైన తాగునీరు ఇలా వృథా అవుతుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే లీకేజీని గుర్తించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి, వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసిన బీజేపీ నేతలు



దశ, ఓయూ: సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా అంగన్ మిలన్ కార్యక్రమం ద్వారా బీదల బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి పాల్గొని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. చిన్నారులతో సమయం గడపడం, వారికి ఆహార పదార్థాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, కందాడి నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్ గిరి, డివిజన్ అధ్యక్షుడు అరవింద్ చందుపట్ల, మూత గణేష్, ఆకుల సంపత్, కుమార స్వామి, నీలి శ్రీనివాస్, అయ్యప్ప రెడ్డి, చరణ్ రాజ్, యశ్వంత్ తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



దశ, మంచాల: పేద ప్రజల సంక్షేమమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మంచాలలో నిర్వహించిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన వారికి అధికారులు ఇంటి వద్దకే వచ్చి రేషన్‌కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత పదేళ్లలో రేషన్‌కార్డుల జారీపై నిర్లక్ష్యం జరిగిందని విమర్శించిన మల్‌రెడ్డి రంగారెడ్డి.. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా స్మార్ట్‌రేషన్‌కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందే వరకు ప్రక్రియ కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ ఉల్లంఘన?





- మంచాల మండల సమావేశానికి కాంగ్రెస్ నాయకులు.. మహిళా సర్పంచుల భర్తల హాజరు
- అధికారిక సమావేశంలో రాజకీయ జోక్యంపై అభ్యంతరాలు
- ప్రజాప్రతినిధుల స్థానంలో ఇతరుల హాజరుపై చర్చ
- ఎమ్మెల్యే తీరుపై ప్రతిపక్షాల విమర్శలు

దశ, మంచాల: మంచాల మండలంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రాజకీయ వివాదానికి దారితీసింది. అధికారికంగా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొనాల్సిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు హాజరు కావడం, కొందరు మహిళా సర్పంచుల భర్తలు సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల కోసం నిర్వహించే అధికారిక సమావేశంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల హాజరుపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, నిధుల వినియోగం తదితర అంశాలపై సమీక్షించేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. ఇలాంటి సమావేశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఉండాల్సి ఉండగా, వారి స్థానంలో ఇతరులు హాజరు కావడంపై ప్రశ్నలు తలెత్తాయి.

మహిళా సర్పంచుల స్థానంలో భర్తల హాజరుపై అభ్యంతరం

మండలంలోని కొన్ని గ్రామాలకు మహిళా సర్పంచులు ఎన్నికైన నేపథ్యంలో వారి భర్తలు సమావేశానికి హాజరు కావడం చర్చకు దారితీసింది. ప్రజల ద్వారా ఎన్నికైన సర్పంచులు స్వయంగా సమావేశానికి హాజరై తమ గ్రామ సమస్యలను ప్రస్తావించాల్సి ఉండగా, వారి స్థానంలో భర్తలు హాజరు కావడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. మహిళా ప్రజాప్రతినిధులకు రాజ్యాంగబద్ధంగా లభించిన అధికారాలు, బాధ్యతలను వారి కుటుంబ సభ్యులు నిర్వహించడానికి వీల్లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశంలో జరిగిన పరిణామాలపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

అధికారిక వేదికపై రాజకీయ నేతల హాజరు ఎందుకు?

సర్వసభ్య సమావేశం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో భాగంగా జరిగే అధికారిక సమావేశం. అలాంటి సమావేశంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే పాల్గొనాల్సి ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు హాజరు కావడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమావేశం రాజకీయ వేదికగా మారకూడదని, అధికారిక కార్యక్రమాల్లో నిబంధనలు, ప్రోటోకాల్ పాటించాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే తీరుపై విమర్శలు

సమావేశానికి ఎమ్మెల్యే హాజరైన సందర్భంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడంతో ఎమ్మెల్యే తీరుపై కూడా ప్రతిపక్ష నాయకులు ప్రశ్నలు సంధిస్తున్నారు. అధికారిక సమావేశంలో ఎవరు హాజరు కావాలి, ఎవరు పాల్గొనకూడదనే విషయంలో సంబంధిత అధికారులు స్పష్టమైన నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై కూడా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. అయితే సమావేశానికి హాజరైన వారి హాజరు ఏ హోదాలో జరిగిందనే దానిపై అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందనే ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందిస్తే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సమావేశాల గౌరవం కాపాడాలన్న డిమాండ్

మండల సర్వసభ్య సమావేశాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కీలక వేదికలని, వాటిని రాజకీయ కార్యక్రమాలుగా మార్చకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా మహిళా సర్పంచులకు కేటాయించిన బాధ్యతలను వారి కుటుంబ సభ్యులు చేపట్టకుండా, ఎన్నికైన సర్పంచులే సమావేశాల్లో పాల్గొనేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. సర్వసభ్య సమావేశంలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వడంతో పాటు, భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాల్లో ప్రోటోకాల్ కచ్చితంగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏఐ సృష్టికర్తలుగా మహిళలు ఎదగాలి

- చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు



దశ, ఓయూ: కృత్రిమ మేధస్సు (ఏఐ)ను వినియోగించుకోవడానికే పరిమితం కాకుండా మహిళలు దాని సృష్టికర్తలు, నాయకులుగా ఎదగాలని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధనంజయ పిలుపునిచ్చారు. 'విమెన్ ఇన్ ద ఏఐ ఎరా- ఎంపవరింగ్ ఫ్యూచర్ లీడర్స్' అంశంపై శనివారం విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు నిర్వహించారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీసీ, ఎస్సీ/ఎస్టీ, మైనారిటీస్ సెల్, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ సూర్య ధనంజయ మాట్లాడుతూ.. 'ఏఐ మన కోసం ఏమి చేయగలదు?' అని ఆలోచించడంతోపాటు 'ఏఐ కోసం మనం ఏమి చేయగలం?' అనే దిశగా విద్యార్థినులు ఆలోచించాలన్నారు. ఏఐతో పాటు విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, నైతిక విలువలు, మానవీయత, సామాజిక బాధ్యత అవసరమని పేర్కొన్నారు.

ఏఐతో పాటు సహజ మేధస్సు అవసరం

తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీ దేవసేన మాట్లాడుతూ.. ఏఐతో పాటు సహజ మేధస్సును సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. చాకలి ఐలమ్మ ధైర్యం, పట్టుదల, పోరాట స్ఫూర్తి నుంచి మహిళలు ప్రేరణ పొందాలని సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా డిజిటల్ నైపుణ్యాలు పెంచుకోవాలని, ఏఐను బాధ్యతాయుతంగా, నైతికంగా వినియోగించాలని అన్నారు.

అలహాబాద్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సంగీత శ్రీవాస్తవ మాట్లాడుతూ ఉన్నత విద్య, పరిశోధన, సాంకేతికత, నాయకత్వ రంగాల్లో మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థినులు తమ సామర్థ్యాలపై నమ్మకంతో నూతన సాంకేతిక రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.


విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ.. ఏఐని కేవలం సాంకేతిక సాధనంగా కాకుండా అభ్యసనం, సమస్యల పరిష్కారం, ఆవిష్కరణలు, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో చేపడుతున్న డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఈఆర్‌పీ తదితర కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత ఐలమ్మ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు తదితరులు ప్రసంగించారు. కాలేజీ హ్యాండ్‌బుక్, సెంటినరీ అలుమ్ని మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో 500 మందికి పైగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మారని పాఠశాలల తీరు ...!

- విద్యార్థి సంఘాలు సందర్శించిన రాని చలనం
- సాయంత్రం 7గంటల వరకు పాఠశాల నిర్వహణ
- విద్యార్థులపై అధిక భారం మోపుతున్న ప్రైవేట్ పాఠశాలలు

తాండూర్, దశ ప్రతినిధి: పాఠశాలలకు సంతోషంగా,ఉత్సహంగా వెళ్లాల్సిన విద్యార్థులు భయంతో, మానసిక ఒత్తిడితో వెళ్లాల్సిన పరిస్థితి నెల్కొంది. ఉదయం 7 నుండి సాయంత్రం 7 గంటల వరకు పాఠశాల నిర్వహించడం, దానికి తోడు అధిక హోమ్ వర్క్ లు ఇవ్వడం తో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి రోజు రోజుకు పెరిగిపోతుంది. గత 4 రోజుల క్రితం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి హెచ్చరించిన ప్రైవేట్ పాఠశాలల తీరు మాత్రం మారడం లేదు. ఇప్పటి నుండే 10వ తరగతి క్లాస్ లతో పాటు 9వ తరగతి విద్యార్థులకు కూడా స్పషల్ క్లాస్ లు నిర్వహించడం గమనార్హం. ఈ వ్యవహారం పై స్థానిక విద్యార్థి సంఘాలు స్పందించిన ఫలితం శూన్యం గా మారింది. రోజు రోజు కు పెరుగుతున్న ప్రైవేట్ పాఠశాల దౌర్జన్యం పై ప్రశ్నించే వారే కరువైయ్యారు. విద్యార్థి సంఘాలు స్పందించి, విద్య శాఖ మాత్రం కళ్లు మూసుకొని కూర్చుంది. ఇప్పటి దాక ప్రైవేట్ పాఠశాలపై విద్య శాఖ అధికారులు స్పందించకపోవడం విడ్డూరం.


సింగరేణి లాభాల్లో 40 శాతం వాటా ఇవ్వాలి



దశ, బెల్లంపల్లి: సింగరేణి సంస్థ వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలని టీఎన్‌టీయూసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓపెన్‌కాస్ట్ జీఎంకు టీఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 60 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 58 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగిసి నెలలు గడుస్తున్నా వాస్తవ లాభాలను ప్రకటించకపోవడంపై కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. దీపావళికి ముందు అందించే పీఎల్‌ఆర్ బోనస్‌ను రూ.1.15 లక్షలకు పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పర్మినెంట్ కార్మికులతో సమానంగా లాభాల వాటా చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, పనిముట్ల కొరతను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

- కోదాడలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన ఇన్‌పేషెంట్ విభాగం ప్రారంభం
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే



దశ, కోదాడ: కోదాడ నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కోట్ల రూపాయల ప్రత్యేక నిధులతో అదనపు భవనాలు మరియు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు. కోదాడ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు నూతనంగా నిర్మాణం చేసిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం కోదాడలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి, నూతన భవన నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. రూ.26 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగవంతగాజరుగుతున్నాయాన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, ప్రస్తుతం ఆసుపత్రి రెనోవేషన్‌తో పాటు నూతనంగా నిర్మాణం చేసిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగం పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నేటి నుంచి ఆసుపత్రిలో అన్నివైద్య సేవలు ప్రారంభమయ్యాయని, కోదాడ నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులు, అధికారులకు సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పెండెం వెంకటరమణ, డీసీహెచ్ఓ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.